క్లుప్తంగా

కిసాన్‌సంఘ్ ఆవిర్భావ వేడుకలు



జెండావిష్కరిస్తున్న లక్ష్మీపతిగౌడ్

సిరిసిల్లటౌన్/బోయినపల్లి: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలోని సంఘ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్ జెండా ఆవిష్కరించారు. గోమాత పూజలు, రైతులు నాగళ్లతో ప్రదర్శనలు చేశారు బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్, విలాసాగర్, స్తంభంపల్లి, బోయినపల్లి, తడగొండ తదితర గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. బీకేఎస్ జోనల్ అధ్యక్షుడు జోగినపల్లి సంపత్‌రావు, జిల్లా కార్యదర్శి పులి లక్ష్మీపతిగౌడ్, బియ్యంకార్ శ్రీనివాస్,వేముల పోశెట్టి, ఇబ్రహీం కస్తూరి బాపురెడ్డి, ఆలూరి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికునికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న గౌడకులస్తులు

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రికి చెందిన నాగెల్లి రాములు గీత కార్మికుడు నాలుగు రోజుల క్రితం తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు.ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి కుటుంబానికి వేములవాడ గౌడసంఘం అధ్యక్షుడు చిదురు గోవర్ధన్‌గౌడ్ ఆర్థికసాయం అందించారు. మల్లేశంగౌడ్, మెరుగు రఘు, మల్యాల సురేశ్, పర్శరాములు వెంట ఉన్నారు.

జీవాల మృతికి పరిహారం



పరిహారం అందిస్తున్న సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామంలోని బైరి దేవయ్యకు చెందిన రెండు గొర్రెలు విద్యుత్ తీగలు తెగిపడడంతో మృతిచెందగా మంజూరైన రూ.14వేల పరిహారాన్ని సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అందించారు. సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేణుక, వార్డు సభ్యులు వెంట ఉన్నారు.

డబుల్ బెడ్రూం అందించాలి



మాట్లాడుతున్న పోశెట్టి

వేములవాడఅర్బన్: అర్హులైన కళాకారులకు ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించి ఆదుకోవాలని కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి అన్నారు. వేములవాడ పట్టణంలోని జిల్లా కళాకారుల సమావేశం జిల్లా అధ్యక్షుడు సావనపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రసాధనలో ధూంధాం ఆటపాటలతో ప్రభుత్వాలు కళ్లు తెరిపించిన ఘనత కళాకారులదేనన్నారు. అర్హులైన వృద్ధ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు బొడ్డు రాములు, శ్రీనివాస్,వారాల దేవయ్య, శంకరయ్య ఉన్నారు.

అధిక ధరకు గుట్కా విక్రయం

వేములవాడరూరల్: మొన్నటి వరకు నిషేధిత గుట్కాను విచ్చలవిడిగా విక్రయించగా రెండ్రోజులుగా గుట్కా నిషేధం పుకార్లు రావడంతో వ్యాపారులు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గుట్కాను నిషేధించాలని, ఎవరైనా విక్రయిస్తే పోలీస్, మున్సిపల్, పంచాయతీ అధికారులతో పాటు అన్నిశాఖల అధికారులు తనిఖీచేసి కేసులు నమోదుచేసే అధికారంఇచ్చినట్లు తెలిసింది. కొందరు అధిక ధరకు కొంటున్నట్లు సమాచారం.

రుద్రవరంలో రేవంత్‌రెడ్డి బస

వేములవాడఅర్బన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సేహాత్ జోడో యాత్రలో భాగంగా వేములవాడ మండలంలోని రుద్రవరం –సంకెపల్లి గ్రామాల మధ్యఏర్పాటు చేసిన బస కేంద్రానికి శనివారం రాత్రి చేరుకున్నారు. ఇక్కడే రాత్రి బసచేసి ఆదివారం ఉదయం 8గంటలకు వేములవాడ రాజన్నను దర్శించుకుంటారు. అనంతరం కథలాపూర్ మండలం కలికోటసూరమ్మ చెరువును సందర్శిస్తారు. రుద్రవరం బస కేంద్రానికి వెళ్లి మధ్యాహ్నం భోజనం చేస్తారు. సాయంత్రం 4 గంటలకు సంకెపల్లి, రుద్రవరం నుంచి పాదయాత్రగా వెళ్లి అనుపురం, కొదుముంజ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, తిప్పాపూర్ గ్రామాల మీదుగా వేములవాడ రాజన్న ఆలయం ముందుకు చేరుకుని కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తెలిపారు.

ఆహా ఏమి రుచి..

- నోరూరిస్తున్న మసాలా లస్సీలు
- చల్ల చల్లగా.. రుచికరంగా..
- వేసవి సీజన్‌కు బిజినెస్ అనుకూలం
- హోం డెలివరీతో మరింత ఆదాయం
- సిరిసిల్లలో లేటెస్ట్' ట్రెండ్




సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: మార్చిలోనే మండుటెండలు..జనాలకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దాహం తాపం నుంచి పట్టణ వాసులు ఉపశమనం కోరుకుంటున్నారు. తాగితే కడుపు'చల్లగా..' మెప్పించే రుచులతో కూడిన లస్సీని ఆస్వాదిస్తున్నారు. సిరిసిల్ల పట్టణవాసులు. వేసవికి అనుగుణంగా తయారయ్యే లస్సీ ఇప్పుడు అన్నివర్గాల వారు ఇష్టపడుతున్నారు. నగరాల్లో మాదిరిగానే అన్ని ఫ్లేవర్స్‌లో రుచికరమైన లస్సీపై ఈవారం సండే స్పెషల్..

కూల్..కూల్..లస్సీ ధరలు..(రూపాయల్లో)



లస్సీ	40
మసాలా లస్సీ	50
స్ట్రాబెర్రీ లస్సీ	50
బ్లూబెర్రీ లస్సీ	50
బనాన లస్సీ	40
పైనాపిల్ లస్సీ	45
చాక్‌లెట్ లస్సీ	40



క్రేజీ..లస్సీ..

చిక్కని చల్లలో పంచధార కలిపి అందులో డ్రైఫ్రూట్స్, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారయ్యే లస్సీ అమ్మకాలకు ఆదరణ పెరిగింది. లస్సీని పంజాబ్ రాష్ట్రప్రజలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఈ క్రమంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి మహానగరాల్లో విభిన్న రుచుల్లో లభించే లస్సీ ఇప్పుడు సిరిసిల్లలోని చిరు వ్యాపారులు మొదలు రెస్టారెంట్లలో అమ్ముతున్నారు. అన్నిరకాల జ్యూస్‌స్టాళ్ల, హోటల్స్‌లో అమ్ముతుండడంతో పట్టణ ప్రజలు పసందైన రుచుల్లో కొనుగోలు చేసి తాగి మైమరచిపోతున్నారు.

ఎన్నెన్నో..రుచులు..

సాధారణ లస్సీ అంటే అందరికీ తెలుసు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా స్థానిక జ్యూస్ స్టాల్స్, కూల్‌డ్రింక్స్ షాపులతో పాటు ప్రత్యేకంగా లస్సీ స్టాళ్లు సిరిసిల్లలో వెలిశాయి. స్వీట్ లస్సీ, బనాన లస్సీ, పైనాపిల్ లస్సీ, మ్యాంగో లస్సీ, బ్లూబెర్రీ లస్సీ, స్ట్రాబెర్రీ లస్సీ, మసాల లస్సీలు సిరిసిల్లలో ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. పట్టణంలోని జ్యూస్ సెంటర్లతో ఉపాధి పొందుతున్న యువత సాధారణంగా లభించే జ్యూస్‌లతో పాటుగా విభిన్న టేస్టుల్లో లస్సీని తయారు చేస్తున్నారు. డ్రైఫ్రూట్స్, ఫ్రూట్స్, మెంథాల్, చాక్‌లెట్, మసాల వంటి ఫ్లేవర్స్‌తో లస్సీని తయారు చేస్తున్నారు. కస్టమర్లు ఆర్డర్ ఇచ్చిన వెంటనే వివిధ రకాల ఫ్లేవర్స్‌తో తయారు చేసి ఇస్తున్నారు. నోటికి తగలగానే 'ఆహా' అనిపించే రుచితో కస్టమర్లను మెప్పిస్తున్నారు. ఆర్డర్లపై హోమ్ డెలివరీ చేస్తున్నారు.

సమ్మర్ డ్రింక్‌గా.. మంచిపేరు



సమ్మర్ డ్రింక్‌గా లస్సీకి సిరిసిల్లలో మంచి పేరుంది. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా లస్సీతో పాటు ఇతర శీతల పానీయాలను తయారుచేస్తున్నాం. సమ్మర్‌లో తాగడానికి పర్‌ఫెక్టు డ్రింక్ లస్సీ. అందుకే అన్నివర్గాల వారినుంచి డిమాండ్ ఉంది.

జిల్ల హరిబాబు, చిరువ్యాపారి

కొత్త ఫ్లేవర్స్ బాగున్నాయి..



గతంలో సాధారణ లస్సీ మాత్రమే తాగేవాళ్లం. హైదరాబాద్ వంటి నగరాల్లో అమ్మే వెరైటీ ఫ్లేవర్స్‌ను సిరిసిల్లలో అందిస్తున్నారు. ఎండలో నుంచి వచ్చి చల్లని తియ్యటి మసాలా లస్సీ తాగితే ..ఆ మజానే వేరు. ఆకలి నుంచి ఉపశమనం కూడా. ఆర్డర్ ఇస్తే.. ఆన్‌లైన్‌లో వివిధ రుచుల్లో లస్సీని తయారు చేసి పంపిస్తున్నారు.

తిరుపతి, కస్టమర్

రసాయనాలు వద్దు.. సహజరంగులే ముద్దు



హోలీకి రంగులను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

- ప్రకృతి సహజ సిద్ధమైన రంగులు ఆవిష్కరణ
- కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం హోలీ వేడుకల సందర్భంగా సైన్స్ విద్యార్థులు ప్రకృతి సహజ సిద్ధమైన రంగులను తయారు చేసి ఆవిష్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. రసాయనాలతో చేసిన రంగులు ఆరోగ్యానికి హానికరమన్నారు. ప్రకృతి సిద్ధమైన రంగులను మాత్రమే వాడాలన్నారు. విద్యార్థులు పండ్లు, కూరగాయాలు, పూలు, క్యారెట్, బీట్రూట్, గోపిపువ్వులో ఆకుపచ్చ ఎరుపు, పసుసుపచ్చ, నలుపు, గోధుమ, గులాబీ రంగులను తయారుచేసి ప్రయోగశాలలో ఆవిష్కరించారన్నారు. అనంతరతం విద్యార్థులు, అధ్యాపకులు ముందస్తుగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మధురాజేశ్, రమాదేవి, ప్రభాకర్, శ్రీనివాసులు, రాజేశ్, ఉన్నారు.

సామగ్రి దహనం



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంటిలోని సామగ్రిని తగులబెట్టిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలో సుభాష్‌నగర్‌లో నివసిస్తున్న సిరిపురం లక్ష్మణ్ ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లో చదువుకుంటున్న తన కూతురు వద్దకు ఇంటిల్లిపాది వెళ్లారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంటిలోని బీరువా, అల్మార, ఫర్నీచర్‌కు నిప్పంటించారు. ఈక్రమంలో హైదరాబాద్ వెళ్లిన లక్ష్మణ్ శనివారం మధ్యాహ్నం వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగిలి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు కాల్చిఉన్నాయి. సామగ్రిని తీసుకెళ్లకుండా కాల్చివేయడం ఏమిటని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటన స్థలాన్ని ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

చందుర్తి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: కార్పొరేట్ వైద్యం అందని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని చందుర్తి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మూడపల్లికి చెందిన మడిపల్లి దేవవ్వకు రూ.48వేల చెక్కును, రాచర్ల రేణకు రూ.36వేల చెక్కును, ఎన్గల్‌కు చెందిన మారుపాక లచ్చయ్యకు రూ.58వేల చెక్కులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు చిలుక అంజిబాబు, లింగంపల్లి సత్తయ్య బీఆర్‌ఎస్ నాయకుల సమక్షంలో పంపిణీ చేసినట్లు ఎల్లయ్య తెలిపారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన ముత్యం సత్తవ్వకు రూ.60వేల చెక్కును సర్పంచ్ మంతెన సంతోష్, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు జొగ్రీగ మల్లేశం అందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల సర్పంచులఫోరం అధ్యక్షుడు బాలిరెడ్డి అందించినట్లు గ్రామాధ్యక్షుడు ల్యాగల నారాయణ రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు బుజంకార్ వంశీకి రూ.47,500 ముస్కూరి లక్ష్మికి రూ.35వేలు చెక్కులు పంపిణీచేశారు. వీర్నపల్లి, గర్జనపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గర్జనపల్లిలో గామలస్మవ్వకు రూ.20వేలు, గౌరి సుజాతకు రూ.30వేలు, సాయిచరణ్‌కు రూ.27,500 అందించారు.

ఘనంగా బీరప్ప గంగబోనం



ఊరేగింపులో బీర్ల కళాకారుల విన్యాసాలు

బోయినపల్లి(చొప్పదండి): తడగొండలో కుర్మసంఘం ఆధ్వర్యంలో శనివారం బీరప్ప గంగబోనం నిర్వహించారు. ఊరేగింపులో బీర్ల కళాకారుల ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.

భూపోరాటం ఆత్మగౌరవం నిలిపింది

- పేదలకు అండగా కమ్యూనిస్టులు
- అర్హులైన పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



సిరిసిల్లలో మాట్లాడుతున్న వీరయ్య



సీపీఐ ఆధ్వర్యంలో నాయకుల వంటావార్పు

సిరిసిల్లటౌన్: కమ్యూనిస్టులు చేపట్టిన భూపోరాటమే పేదల ఆత్మగౌరవాన్ని నిలిపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. సిరిసిల్లలోని అంబాభవాని ఫంక్షన్‌హాల్‌లో సొంతిళ్లు లేని పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సాధన పేరుతో శనివారం నిర్వహించిన సదస్సుకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. నివేశన స్థలాల పట్టాలు అందించి, ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న సిరిసిల్లకు యాత్ర వస్తున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కై లాబ్‌బాబు, జగదీశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, నక్క దేవదాసు, సూరం పద్మ, సామల కవిత, స్వప్న, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వంటావార్పు

వీర్నపల్లి: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు జంగం అంజయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద సిలిండర్‌లతో వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం కంటే ముందే గ్యాస్‌ధరలు పెంచి మహిళలకు బీజేపీ ప్రభుత్వం కానుకగా ఇచ్చిందన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో యాదవుల కులదైవమైన సౌడాలమ్మ పండుగలో భాగంగా శనివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఒగ్గు కళాకారుల డప్పుచప్పుళ్ల ఆటపాటలతో, మహిళలు నెత్తిన బోనాలతో పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు



యువకులకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్లాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు, జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, సర్పంచ్ ఇల్లెందుల శంకరయ్య, వైస్‌ఎంపీపీ కొనుగోటి నాగయ్య, ఏఎంసీచైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సింగిల్ విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇల్లంతకుంట: పెండింగ్‌లో ఉన్న రూ.5,500ల కోట్ల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదలచేయాలని ఏబీవీపీ నాయకులు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెం నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీసం స్కాలర్‌షిప్ ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పుకోవడమే గాని ఏరోజు కూడా విద్యార్థులకు సమయానికి స్కాలర్‌షిప్‌లు అందించలేదన్నారు. విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ కళాశాలలకు స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదలచేయాలని డిమాండ్‌చేశారు. ప్రవీణ్, మధు అనిల్, సునీల్, ప్రశాంత్, తదితరులున్నారు.

మన ఊరు మనబడి పనులు త్వరగా పూర్తిచేయాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో రమేశ్

కోనరావుపేట: మన ఊరు మన బడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న అభివృద్ధిపనులు త్వరగా పూర్తిచేయాలని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మారం, సుద్దాల గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలలో పనులను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించి మేజర్, మైనర్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో దూస రఘుపతి, హెచ్‌ఎంలు స్వప్న, దేవేందర్‌రావు, శారద, రవీందర్, ఎస్సెమ్సీ చైర్మన్లు తిరుపతి, విజయ్‌కుమార్, టీచర్లు ఉన్నారు.

వెంటాడిన విధి

- నిజామాబాద్‌లో వివాహిత బలవన్మరణం
- రెండు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు



అనూష మృతదేహం



చికిత్స పొందుతున్న చిన్నారి

ముస్తాబాద్(సిరిసిల్ల): విధి ఆ చిన్నారులపై పగబట్టిందేమో అభం శుభం తెలియని వయసులోనే తల్లిదండ్రులను కో ల్పోయారు. రక్తం పంచుకుపుట్టిన కొడుకు రెండు నెలల క్రితమే దూరం కాగా, ఇప్పుడు పెద్దదిక్కు అవుతుందనుకున్న కోడలు లేకపోవడంతో పండుటాకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముస్తాబాద్‌కు చెందిన జటాల అనూష నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కూతురు శ్రీకృతితో కలిసి శనివారం అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మూడేళ్ల శ్రీకృతికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటన ముస్తాబాద్‌లోని వారి బంధువులను విషాదంలో ముంచింది. ముస్తాబాద్‌కు చెందిన జటాల ప్రేమానందం, కల్పన దంపతులు వ్యాపార రీత్యా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. వీరి పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెండు నెలల క్రితమే మృతిచెందాడు. ఆ బాధ నుంచి తెరుకోకముందే నిజామాబాద్‌లో పెద్దనాన్న ఇంటికి వెళ్లిన ప్రేమానందం కోడలు అనూష శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. అనూష పెద్దకూతురు శ్రీవల్లికి జ్వరం రావడంతో కరీంనగర్‌లోనే తాత ప్రేమానందం వద్ద ఉంచి వెళ్లింది. భర్త మరణాన్ని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది అనూష ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొంటున్నారు. ప్రేమానందం కూడా తీవ్ర అనారోగ్యంతో మంచంపట్టాడు. ఆయన చిన్న కుమారుడు కెనడాలో ఉంటున్నాడు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



ముస్తాబాద్: యాసంగి సాగుకు నాణ్య మైన విద్యుత్ అందిస్తున్నామని సెస్ డై రెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో రైతుల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్,సెస్‌చైర్మన్ చిక్కా ల రామారావు సహకారంతో ముస్తాబా ద్ మండలంలో త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి పలు గ్రామాల్లో ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశామన్నారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో బి ల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నా రు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచ్ బద్ది క ల్యాణి, ఎంపీటీసీ లలిత, భాను, సత్యం, క్రాంతి, నర్సింలు, సతీశ్, చందర్‌రావు, మల్లారెడ్డి, రాజయ్య రవి, ప్రతాప్, మొండయ్య, చంద్రయ్య, కిష్టయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగ పరికరాలతో విద్యార్థులు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్



ప్రదర్శన తిలకిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు

గంభీరావుపేట/ఇల్లంతకుంట: గంభీరావుపేట మండలకేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచి తల్లిదండ్రులలకు, తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి, ప్రిన్సిపాల్ సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిషన్, దేవరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలను జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు ప్రారంభించారు. ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, చల్లా నారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్‌చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.